బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 14 ఫిబ్రవరి 2026 www.balagamtv.com పేజీలు 4

## మోడల్ స్కూల్స్ దరఖాస్తులకు
# ఫిబ్రవరి 28 వరకు గడువు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**


మోడల్ స్కూల్స్‌లో 2026-27 విద్యాసంవత్సరానికి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల విద్యా సంచాలకులు డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 194 మోడల్ స్కూల్స్ ఉండగా ఇందులో ఒక్కో స్కూల్‌లో 6వ తరగతిలో వంద మంది చొప్పున విద్యార్థులను తీసుకుంటున్నారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేయనున్నారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 19న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు (6వ తరగతికి), మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు (7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు) నిర్వహించనున్నారు. దరఖాస్తు రుసుం రూ.200 (ఒసీలకు), రూ.125 (ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీడబ్ల్యూడీ, ఈడబ్ల్యూఎస్)గా నిర్ణయించారు. మరిన్ని వివరాలకు www.tgms.telangana.gov.inలో చూడొచ్చు. ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేయగా 11,766 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 6వ తరగతి కోసం 7,821 మంది, మిగితా 4వ పేజీలో

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా

## 116 మున్సిపాలిటీల్లో 68 చోట్ల విజయం

- 14 మున్సిపాల్టీలు కైవసం చేసుకున్న బీఆర్ఎస్
- ఖాతా తెరవని బీజేపీ
- 33 చోట్ల హంగ్
- 1,533 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు
- 775 స్థానాలతో రెండో స్థానంలో బీఆర్ఎస్
- కార్పొరేషన్లలో 4 కాంగ్రెస్ కైవసం
- నిజామాబాద్, కరీంనగర్‌లో బీజేపీకి మెజారిటీ
- 16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోరు ముగిసింది. మొత్తంగా పట్టణ ఓటరు తీర్పు అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వచ్చింది.మొత్తం 116 మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగగా, అందులో కాంగ్రెస్ 68 చోట్ల గెలుపొందింది. బీఆర్ఎస్ 14 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంది. 33 మున్సిపాలిటీల్లో ప్రధాన పార్టీలకు సమాన సీట్లు రావడంతో హంగ్ పరిస్థితి ఏర్పడింది. గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అనూహ్య విజయం సాధించింది. బీజేపీ ఒక్క మున్సిపాలిటీ కూడా గెలవలేకపోయింది.

**కార్పొరేషన్ల ఫలితాలు**

మొత్తం 7 కార్పొరేషన్లలో పోలింగ్ జరగగా, అందులో నాలుగు కార్పొరేషన్లు కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లను బీజేపీ గెలుచుకుంది. బీఆర్ఎస్ ఒక్క కార్పొరేషన్‌లో కూడా ఖాతా తెరవలేకపోయింది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో కాంగ్రెస్, సీపీఐలకు చెరో 22 డివిజన్లు రావడంతో హంగ్ పరిస్థితి నెలకొంది.

**కాంగ్రెస్ 1,533..బీఆర్ఎస్ 775**

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో 2996 వార్డులో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 12 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ఒక వార్డులో ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 2,983 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వాటిలో తుది వార్తలు అందే సమయానికి కాంగ్రెస్ పార్టీ 1,533 వార్డుల్లో గెలుపొందింది. బీఆర్ఎస్ 775, బీజేపీ 330, ఇతరులు 173, ఎంఐఎం 70 వార్డుల్లో విజయం సాధించాయి. సీపీఐ 35, సీపీఐ(ఎం) 13 వార్డులు గెలిచాయి. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలు పార్టీ రహితంగా జరిగినప్పటికి ఆ పార్టీ బలపర్చిన వారే మూడింట రెండోంతుల మంది జయ కేతనం ఎగుర వేశారు.

| | | |
|---|---|---|
| మొత్తం కార్పొరేషన్లు | - | 7 |
| కాంగ్రెస్ | - | 4 |
| సీపీఐ | - | 1 |
| హంగ్ | - | 2 |

| | | |
|---|---|---|
| మున్సిపాల్టీలు | - | 116 |
| కాంగ్రెస్ | - | 68 |
| బీఆర్ఎస్ | - | 14 |
| ఫార్వర్డ్‌బ్లాక్ | - | 1 |

మున్సిపల్ ఎన్నికల్లోనూ సర్పంచ్ ఫలితాలే పునరావృతం అయ్యాయి. రామగుండం కార్పొరేషన్‌లో మొత్తం 60 వార్డుల్లో 30, మంచిర్యాలలో 60 మిగితా 4వ పేజీలో

# సేవా తీర్థ్‌లో ప్రతి క్షణం దేశహితం కోసమే

- వికసిత్ భారత్-2047 దేశ ప్రతిజ్ఞ
- ప్రధాని నరేంద్ర మోదీ



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

సేవా తీర్థ్, కర్తవ్య భవన్ దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిర్మించబడినవని, ఇవి ఏ చక్రవర్తి ఆశయాలకు సంబంధించినవి కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. సేవా తీర్థ్, కర్తవ్య భవన్-1, 2లను ప్రారంభించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "సేవా తీర్థ్‌లో ప్రతి క్షణం దేశహితం కోసమే పనిచేస్తాం. వికసిత్ భారత్ దిశగా ముందుకు సాగుతున్నాం. లక్ష్య సాధనలో బానిసత్వపు ఆనవాళ్ల నుంచి బయటపడాలి" అని ప్రధాని పేర్కొన్నారు.

గతంలో ప్రాణత్యాగం చేసిన సైనికులకు జాతీయ స్మారకం లేకపోయిందని గుర్తుచేసిన ప్రధాని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత నేషనల్ వార్ మెమోరియల్, పోలీసు స్మారకాన్ని నిర్మించామని తెలిపారు. రేస్‌కోర్స్ రోడ్‌కు లోక్ కల్యాణ్ మార్గ్‌గా, మొఘల్ గార్డెన్స్‌కు అమృత్ ఉద్యాన్‌గా పేరుమార్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు."బ్రిటిష్ ఇండియా కాలంలో నిర్మించిన సౌత్‌బ్లాక్, నార్త్‌బ్లాక్ భవనాలు బానిసత్వపు గుర్తులను గుర్తు చేస్తాయి. 1911లో బ్రిటిషర్లు రాజధానిని కోల్‌కతా నుంచి దిల్లీకి మార్చి ఈ భవనాలను నిర్మించారు. ఇప్పుడు సేవా తీర్థ్, కర్తవ్య భవన్‌లు స్వేచ్ఛ, స్వయంపాలనకు సంకేతాలు" అని మోదీ అన్నారు.

సౌత్‌బ్లాక్, నార్త్‌బ్లాక్‌లలో స్థలాభావం, సౌకర్యాల లోపం ఉన్నాయని, రెండు భవనాల మధ్య రాకపోకలకు ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురయ్యేవని తెలిపారు. సేవా తీర్థ్ ద్వారా అన్ని శాఖలు ఏకీకృతమై, సమన్వయం మెరుగుపడుతుందని చెప్పారు. పాత భవనాలను మ్యూజియంలుగా మారుస్తామని వెల్లడించారు.

**వికసిత్ భారత్ కేవలం నినాదం కాదు**

వికసిత్ భారత్-2047 కేవలం నినాదం కాదని, అది దేశ ప్రతిజ్ఞ అని ప్రధాని ఉద్ఘాటించారు. గత సంవత్సరాల్లో పాతిక కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. 140 కోట్ల భారతీయుల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిబింబమే వికసిత్ భారత్ అని పేర్కొన్నారు. "ఎవరిపని వాళ్లు నిజాయతీగా నిర్వహించడమే అసలైన 'సేవ" అని మహాత్మా గాంధీ చెప్పిన మాటలను గుర్తుచేసిన ప్రధాని, భావితరాల కోసం బాధ్యతాయుతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ సాధనలో ప్రజలందరూ చేతులు కలపాలని కోరారు.

**ప్రత్యేక రూ.100 నాణెం విడుదల**

సేవా తీర్థ్ సముదాయ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని రూ.100 ప్రత్యేక నాణట్లన్ని విడుదల చేశారు. ఇకపై అత్యాధునిక వసతులతో కూడిన ఈ భవనం నుంచే ప్రధానమంత్రి కార్యాలయం కార్యకలాపాలు కొనసాగించనుంది. సేవా తీర్థ్‌లో పీఎంఓతో పాటు కేబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి కార్యాలయాలు పనిచేయనున్నాయి. భవన గోడపై "నాగరికో దేవో భవా" అనే వాక్యాన్ని ప్రతిష్ఠించారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు, పర్యావరణహిత సదుపాయాలతో నిర్మించిన ఈ సముదాయం దేశ పరిపాలనలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని అధికారులు తెలిపారు.

# ప్రజల విశ్వాసానికి ఇది నిదర్శనం




- అభివృద్ధి, సంక్షేమానికే ప్రజలు పెద్దపీట
- బీఆర్ఎస్, బీజేపీ కట్టు కథలు నమ్మలేదు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాన్ని ప్రజల విశ్వాసానికి నిదర్శనం అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాన్ని ప్రజల విశ్వాసానికి నిదర్శనంగా అభివర్ణించిన ఆయన, ఇది ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకానికి ప్రతిఫలమని తెలిపారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్లే పట్టణ ఓటరు కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారని చెప్పారు. ప్రభుత్వం పారదర్శక పాలనకు కట్టుబడి ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. పట్టణాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, మౌలిక వసతుల మెరుగుదలపై దృష్టి సారిస్తామని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని, ప్రతిపక్షాల విమర్శలకు పనితీరుతోనే సమాధానం ఇస్తామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్ ఎన్నికల్లో 83 మున్సిపాలిటీలు, ఐదు కార్పొరేషన్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందని తెలిపారు. ఇంకా కొంత సమాచారం రావాల్సి ఉందనీ, తమ స్థానాలు మరిన్ని పెరుగుతాయని అన్నారు. స్వతంత్రులు ఇతర పార్టీల వారు తమ పార్టీతో కలిసి పని చేయడానికి ఆసక్తిగా ఉన్నారని పేర్కొన్నారు. మొత్తంగా 116 మున్సిపాలిటీలకు గాను 90 నుంచి 94 మున్సిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో జమవుతాయని స్పష్టం చేశారు. ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా, ఐదు కార్పొరేషన్లలో కాంగ్రెస్ తిరుగులేని మెజారిటీ సాధించిందని తెలిపారు. మరో రెండు చోట్ల హంగ్ ఏర్పడిందన్నారు. రెండు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ పార్టీకి ఇంత పెద్దఎత్తున మున్సిపల్ స్థానాలు రావడం సంతోషం కలిగించే విషయమన్నారు. అభివృద్ధి, సంక్షేమం విశ్వసనీయతకు రాష్ట్ర ప్రజలు పెద్దపీట వేశారనేది ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారనే విషయం ఈ ఫలితాలతో తేటతెల్లమైందని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, మిగితా 4వ పేజీలో

## ముఖ్యమంత్రికి
## ప్రియాంక గాంధీ అభినందనలు



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై లోక్‌సభ సభ్యురాలు, ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఢిల్లీలో ప్రియాంక గాంధీతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. భేటీ సందర్భంగా రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై విస్తృతంగా చర్చించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘన విజయంపై ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేస్తూ, రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు

- ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల అహర్నిశ శ్రమ ఫలితం : సీఎం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల అహర్నిశ శ్రమ ఫలితమని ఆయన పేర్కొన్నారు. పార్టీ పట్ల వారికి ఉన్న అపారమైన అభిమానానికి ఇది నిదర్శనమని తెలిపారు. భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నామని వెల్లడించారు.

రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలన, పేద--మధ్యతరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా సంపూర్ణ ఆమోదం తెలిపారని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని పేర్కొంటూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితమవుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో ప్రతి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌ను మరింత అభివృద్ధి చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు.

**హైదరాబాద్‌కు సీఎం రేవంత్ రెడ్డి**

సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటన కోసం ఢిల్లీ వెళ్లిన ఆయన శుక్రవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రికి ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ తదితరులు స్వాగతం పలికారు. మున్సిపల్ ఎన్నికల్లో హస్తం పార్టీ ఘన విజయం సాధించడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు.



# బీజేపీకి ఓటు శాతం పెరగడం
## సానుకూల సంకేతం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ లక్ష్యాలకు తక్కువ సీట్లు వచ్చిన విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు అంగీకరించారు. అయితే ఓటు శాతం గణనీయంగా పెరగడం, కొత్త ప్రాంతాల్లో విజయాలు సాధించడం పార్టీకి సానుకూల సంకేతమని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గత ఎన్నికల్లో 241 వార్డులు గెలిచిన బీజేపీ ఈసారి 320 నుంచి 350 వార్డులు సాధించే స్థితిలో ఉందన్నారు. వేములవాడ, రాయికల్, నారాయణపేట, ఆదిలాబాద్, మెట్‌పల్లి మున్సిపాలిటీలను పార్టీ స్వతంత్రంగా గెలుచుకుంటుందని తెలిపారు. గతంలో కేవలం రెండు మున్సిపాలిటీలకే పరిమితమైన బీజేపీ, ఈసారి నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లను కైవసం చేసుకుందని చెప్పారు. కాంగ్రెస్ బలమైన ప్రదర్శన చేశామన్న వాదనను ఆయన తోసిపుచ్చారు. స్థానిక ఎన్నికల్లో సాధారణంగా అధికార పార్టీకే లాభం ఉంటుందని పేర్కొంటూ, "స్పష్టమైన మెజారిటీలు లేకుండా కాంగ్రెస్ గొప్పలు చెప్పుకోవడానికి ఏమీలేదు. అధికార దుర్వినియోగం, అధికారం ఆధారంగా సాధించిన విజయాలు మాత్రమే" అని ఆరోపించారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎంఐఎం మద్దతుతో సీట్లు గెలుచుకున్నాయి**

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎంఐఎం మద్దతుతో సీట్లు గెలుచుకున్నాయని, పట్టణ నక్సలైట్లు, కమ్యూనిస్టులు, ఎంఐఎం కలిసి బీజేపీకి వ్యతిరేకంగా పనిచేశారని ఆరోపించారు. కాంగ్రెస్--ఎంఐఎం--బీఆర్ఎస్‌ల మధ్య "ఫెవికాల్ బంధం" ఉందని వ్యాఖ్యానించారు. బీజేపీ ఓటు శాతం 13 శాతం నుంచి 20 శాతానికి పెరిగిందని, ఆరు మున్సిపాలిటీల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. 2 నుంచి 25 ఓట్ల తేడాతో దాదాపు 200 వార్డులు కోల్పోయామని తెలిపారు. హంగ్ కౌన్సిళ్లలో బీజేపీ ఏ పార్టీకి మద్దతు ఇవ్వదని స్పష్టం చేశారు. 'నారాయణపేట, ఆదిలాబాద్, కొత్తగూడెం, వైరాలో తొలిసారి విజయం సాధించాం. చాలా వార్డుల్లో 2 నుంచి 25 ఓట్ల తేడాతో ఓడిపోయాం. ఈ ఎన్నికల్లో బీజేపీ బలం పెరిగింది.. దీక్షా ఓట్ల శాతం తగ్గింది. 20 శాతం ఓట్లు బీజేపీకి పెరిగాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ నైతికంగా విజయం సాధించింది. ఈ ఫలితాలు అధికార పార్టీకి హెచ్చరిక. క్షేత్రస్థాయిలో బీజేపీ బలం పుంజుకుంది' అని అన్నారు.

రాత్రి ఆలస్యంగా 'ఎక్స్' వేదికగా స్పందించిన రామచందర్ రావు, తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ ప్రదర్శన నిర్ణాయక మార్పునకు సంకేతమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పడిపోయిన ఓట్ల శాతం ప్రజల నిర్మాణాత్మక తిరస్కారమని అభివర్ణించారు. అధికార యంత్రాంగం, డబ్బు ప్రభావం, బెదిరింపులు ఉన్నప్పటికీ కాంగ్రెస్ కేవలం 55 శాతం వార్డుల వరకే పరిమితమైందని వ్యాఖ్యానించారు. "స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ సాధారణంగా భారీ విజయం సాధించే నేపథ్యంలో ఇది ఏ మాత్రం ఘన మాండేట్ కాదు" అని ఆయన అన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యానికి, బీఆర్ఎస్ పోరాటానికి నిదర్శనం




- మెరుగైన ఫలితాలు సాధించాం
- కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐకి మద్దతు
- సింగరేణిలో దోపిడీకి అడ్డుకట్ట వేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**


మునిసిపల్ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలు, నాయకులు, ఓటర్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీ అనేక రకాలుగా ప్రభావితం చేసే ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రజల మనసు గెలుచుకోలేకపోయిందని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్? మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నిజానికి అధికార పార్టీ ఎన్ని రకాలుగా ఈ ఎన్నికల్లో సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించే ప్రయత్నం చేసినా వారు స్పష్టంగా ప్రజల మనసు గెలవడంలో విఫలమైనారు. పంచాయతీ ఎన్నికలు గాని, మున్సిపల్ ఎన్నికలు అధికారంలో ఉన్న పార్టీకి ముఖ్యంగా ఇంకో రెండు మూడేళ్లు ఉండే అవకాశం ఉన్నప్పుడు, అధికారంలో కొనసాగే అవకాశం ఉన్నప్పుడు మరి ఇది అధికార మార్పిడి కోసం జరిగేది కాదు కదా అనే ఆలోచన ఈ మధ్యనే దేశవ్యాప్తంగా ప్రజల్లో కనపడతున్నది. దానికి భిన్నంగా తెలంగాణలో మీరు చూసినట్లయితే మొన్న పంచాయతీ ఎన్నికల్లో రెండేళ్లు తిరగకముందే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్తూ దాదాపు 40 శాతం గ్రామ పంచాయతీలు బిఆర్ఎస్ పార్టీకి కట్టబెట్టారు, 4000 పైచిలుకు గ్రామాల్లో మా సర్పంచులు గెలిచారని అన్నారు.

ఈ మున్సిపల్ ఫలితాలు చూస్తే కూడా డెఫినెట్ గా గతంలో ఎవరెవరైతే ఏదో మాట్లాడినారో వారందరి నోళ్లు మూతలు పడే విధంగా ఇవాళ మరి మెరుగైన ఫలితాలే సాధించాము. 2020లో ఆనాడు మున్సిపల్ ఎన్నికలు జరిగితే మొత్తం 130 మేయర్లకు, చైర్ పర్సన్లకు ఆనాడు మున్సిపల్ ఎన్నికలు జరిగింది. టిఆర్ఎస్ పార్టీ ఆ రోజు డైరెక్టుగా 122 టిఆర్ఎస్ గెలిస్తే మున్సిపాలిటీలు అదేవిధంగా కార్పొరేషన్లు, కాంగ్రెస్ నాలుగు గెలిచింది, బిజెపి రెండు గెలిచింది, ఎంఐఎం రెండు గెలిచింది. ఇది ఆ రోజు లెక్క 2020. మరి ఈ రోజు ఇప్పుడే నేను మీ ముందు పెడుతున్న లెక్క చూస్తే ప్రత్యక్షంగా డైరెక్టుగా మేము ఇప్పుడు 15 పైన గెలవబోతా ఉన్నాము. దాంతోపాటు పరోక్షంగా అంటే మేము సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఉన్న కాడ మరి దాదాపు మరో 10, 15 చోట్ల మాకు అవకాశం ఉందని తెలిపారు.కాబట్టి ఓవరాల్ గా చూసుకుంటే 117 లో డెఫినెట్ గా మంచి ఫలితాలు వచ్చినట్టుగానే మేము భావిస్తా ఉన్నాము. అయితే సరే ఈ డబ్బు, మద్యం, అధికార యంత్రాంగ దుర్వినియోగం ఇవన్నీ కూడా పరాకాష్టకు చేరినాయి. చాలా చోట్ల మరి పెద్ద ఎత్తున విస్తృతంగా అధికార దుర్వినియోగం కూడా జరిగింది. అయినప్పటికీ ఓటర్లు మాత్రం భయపడకుండా బయటకు వచ్చి ఓటు వేసినందుకు వారికి కూడా మేము ధన్యవాదాలు చెప్తున్నాం. కాంగ్రెస్ బేరాలు, బేరసారాలు, ఎత్తుకుపోవడాలు, పోలీసులను పంపించి బెదిరించడాలు ఇవన్నీ రాష్ట్రవ్యాప్తంగా మొదలైనాయని అన్నారు. మా దగ్గర గెలిచిన వాళ్లను లాక్కునే ప్రయత్నం కూడా చేస్తున్నారు. అయినా కూడా పర్వాలేదు కొట్లాడుదామని అన్నారు.

మాకు సంతోషకరమైన విషయం ఏమిటంటే సింగరేణిలో జరుగుతున్న బొగ్గు కుంభకోణం ఏదైతే ముఖ్యమంత్రి గారి బావమరిది కీలక పాత్రధారిగా, ముఖ్యమంత్రి బావమరిదే కింగ్ పిన్ గా సింగరేణిలో ఏదైతే 6000 కోట్ల కుంభకోణాలు చేసినారని మేము బయటపెట్టినామో, దాని తర్వాత మాతో పాటు సిపిఐ (కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా) కలిసి వచ్చి మాకు చెన్నూరు నియోజకవర్గంలో, క్యాతనపల్లి మున్సిపాలిటీలో మాతో పాటు కలిసి ప్రచారంలో పాల్గొనడమే కాకుండా మున్సిపాలిటీ కూడా మేము గెలుచుకున్నాం. కాంగ్రెస్, బిజెపి కలిసి పని చేసున్నాయి కాబట్టి వారిని నిరోధించడానికి సిపిఐ కలిసి వస్తే వారిని కూడా కలుపుకున్నాం. కొత్తగూడెం శాసనసభ్యులు, రాష్ట్ర సిపిఐ మిగితా 4వ పేజీలో

## మున్సిపల్ ఫలితాలు
## కాంగ్రెస్ పాలనకు చెంపపెట్టు: హరీశ్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్**

ముఖ్యమంత్రి, మంత్రులు సహా యావత్ ప్రభుత్వ యంత్రాంగం ఒక్కటై ప్రయత్నించినా మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపును అడ్డుకోలేకపోయారని మాజీ మంత్రి టి హరీశ్ రావు విమర్శించారు. అధికార దుర్వినియోగం, డబ్బు రాజకీయాలు, బెదిరింపులను తట్టుకుని సాధించిన ఈ విజయాలు కాంగ్రెస్ అప్రజాస్వామిక పాలనకు చెంపపెట్టులాంటివని పేర్కొన్నారు. దాదాపు 700కు పైగా వార్డుల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం యాదృచ్ఛికం కాదని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వంపై రోజురోజుకు పెరుగుతున్న ప్రజావ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. పల్లె, పట్టణం తేడా లేకుండా రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి మందగించిందని, ఎన్నికల హామీలు గాలిలో కలిసిపోయాయని ఆరోపించారు.

సంక్షేమ పథకాలు అటకెక్కాయని, అందుకే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు అధికార పార్టీకి గట్టి సందేశం ఇచ్చారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌ను గద్దె దించే శక్తి ఒక్క బీఆర్ఎస్‌కే ఉందని, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనేనని పంచాయతీ, మున్సిపల్ ఫలితాలు స్పష్టం చేశాయని అన్నారు.అధికార పక్షం దౌర్జన్యాలను ఎదుర్కొని, ప్రతిపక్షంలో నుంచే ఈ ఫలితాలు సాధించడం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని తెలిపారు. కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా గెలిచి సత్తా చాటిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సైనికులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో గులాబీ జెండా ఎగురవేసేందుకు నిరంతర పోరాటం కొనసాగుతుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# బంగ్లాదేశ్ ఎన్నికల్లో బీఎన్‌పీ కూటమి విజయం



**బలగం టీవీ, ఢాకా**

ఢాకా: బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతున్న వేళ Bangladesh Nationalist Party (బీఎన్‌పీ) నేతృత్వంలోని కూటమి స్పష్టమైన ఆధిక్యంతో ముందంజలో ఉంది. ఇప్పటివరకు వెలువడిన అనధికారిక ఫలితాల ప్రకారం బీఎన్‌పీ కూటమి 211 నియోజకవర్గాల్లో విజయం సాధించినట్లు పార్టీ వర్గాలు ప్రకటించాయి. మెజారిటీకి అవసరమైన సీట్ల సంఖ్యను దాటే స్థాయిలో ఆధిక్యం సాధించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మిగితా 4వ పేజీలో


## ఒకే కాలనీలో
# 6 పార్కులను కాపాడిన హైడ్రా

- మరో చోట 1452ల గజాల పార్కును రక్షించిన హైడ్రా
- మొత్తం 3712 గజాల పార్కులకు హైడ్రా ఫెన్సింగ్
- రూ. 37.12 కోట్ల విలువైన భూములను కాపాడిన హైడ్రా



**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రాణవాయువును అందించే పార్కుల కబ్జాలను హైడ్రా సీరియస్‌గా పరిగణిస్తోంది. ఫిర్యాదు మిగితా 4వ పేజీలో


ఓ కాంగ్రెస్ ప్రభుత్వమా!
మేము రిటైర్మెంట్ అయి 15 నెలలు గడిచింది. మాకు రావలసిన, మీరు చెల్లించాల్సిన డబ్బులు ఏ ఒక్క పైసా కూడా రాలేదు. ఇవ్వలేదు అనేక ఇబ్బందులు పడుతూ, అనారోగ్యం పాలవుతూ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం చేయించుకోలేక ఇప్పటి వరకు 62 మంది చనిపోయారు. అందుకే బాధతో మేము చనిపోక ముందే మా డబ్బులు మాకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాము.

## ఓ కాంగ్రెస్ ప్రభుత్వమా.. మా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఎక్కడా?

- **బ్యాలెట్ బాక్స్‌లో పెన్షనర్ ఆవేదన!**

**బలగం టీవీ, సూర్యాపేట:**
మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఒక వింత ఘటన చోటుచేసుకుంది. ఓట్ల కోసం వేచి చూస్తున్న అధికారులకు, అభ్యర్థులకు బ్యాలెట్ బాక్స్‌లో ఓట్లతో పాటు ఒక లేఖ దర్శనమిచ్చింది. సూర్యాపేట 47వ వార్డుకు చెందిన బ్యాలెట్ బాక్స్‌లో ఓ రిటైర్డ్ ఉద్యోగి రాసిన లేఖ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## బీఆర్ఎస్‌దే గడ్డపోతారం మున్సిపాలిటీ..

**బలగం టీవీ, సంగారెడ్డి:**
సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీని భారత రాష్ట్ర సమితి కైవసం చేసుకుంది. మూడింట రెండొంతులకు పైగా వార్డుల్లో ఆ పార్టీ గెలిచింది. మొత్తం 18 వార్డులకు గానూ 14 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. 3 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఒక స్థానంలో స్వతంత్ర అభ్యర్థి నెగ్గారు.






## పెద్దూరు పాఠశాలలో ఘనంగా ఆంగ్లభాష దినోత్సవ వేడుకలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
ఎం పి హెచ్ ఎస్ పెద్దూరు పాఠశాలలో శ్రీమతి సరోజినీ నాయుడు జన్మదిన సందర్భంగా ఆంగ్లభాష దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇంగ్లీషు భాషలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల కృత్యాలు పిల్లలను అలరించడమే కాకుండా వారిలో ఆంగ్ల భాష పట్ల ఆసక్తిని, విజ్ఞానాన్ని పెంచాయి. ఈ కార్యక్రమంలో ఆంగ్లభాషోపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి మరియు నందాల శంకర్లను విద్యార్థిని విద్యార్థులు ,ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ ఇంగ్లీష్ అంతర్జాతీయ భాష అని, లైబ్రరీ లాంగ్వేజ్ అని, ప్రతి ఒక్కరు ఆంగ్ల భాషలో అనర్గళంగా మాట్లాడేలా విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి మరియు ఉపాధ్యాయ బృందం గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, జనగాం రాజమల్లు, ఈరబోయిన రవి కుమార్, భాగ్యనగర్ మాధవి, నాగుల వీణ, నందాల శంకర్, గడ్డి మహేష్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలకు రూ.5,000 జమ చేసిన తమిళనాడు ప్రభుత్వం

- **కలైంగర్ పథకం కింద 1.31 కోట్ల మందికి లబ్ధి**


**బలగం టీవీ, చెన్నై**
అసెంబ్లీ ఎన్నికల వేళ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాష్ట్ర మహిళలకు శుభవార్త ప్రకటించారు. కలైంగర్ పథకం కింద రాష్ట్రంలోని 1.31 కోట్ల మంది మహిళల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున జమ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం నెలవారీ సాయంగా రూ.1,000 అందిస్తున్న సంగతి తెలిసిందే. ఈసారి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల మొత్తాన్ని కలిపి రూ.3,000తో పాటు సమ్మర్ స్పెషల్‌గా మరో రూ.2,000 జమ చేసినట్లు వివరించారు. దీంతో మొత్తం రూ.5,000 మహిళా లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయి.



ఏప్రిల్--మేలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే, ప్రస్తుతం ఇస్తున్న నెలవారీ సాయాన్ని రూ.2,000కు పెంచుతామని వీడియో సందేశంలో స్టాలిన్ వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న నగదు సాయాన్ని అసెంబ్లీ ఎన్నికల కోడ్ పేరిట అడ్డుకునేందుకు బిజెపి, అన్నాడిఎంకె కుట్ర పన్నుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో మూడు నెలల సాయాన్ని ఒకేసారి మహిళల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రాబోయే నెలల్లో కుటుంబ ఖర్చులు, పిల్లల విద్య, మందులు, పరీక్షల వ్యయాలు పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని సమ్మర్ స్పెషల్ కింద అదనంగా రూ.2,000 జమ చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మహిళల ఆర్థిక భద్రతే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో హోరాహోరీ

**బలగం టీవీ, రంగారెడ్డి**
ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. మొత్తం 13 మున్సిపాలిటీలలో కాంగ్రెస్ 6 స్థానాలు కైవసం చేసుకోగా, బీఆర్ఎస్ 4 స్థానాలు దక్కించుకుంది. అలియాబాద్, పరిగిలో హంగ్ ఫలితాలు నమోదవగా, మొయినాబాద్‌లో ఎవరూ మ్యాజిక్ ఫిగర్ సాధించలేకపోయారు.




రంగారెడ్డి జిల్లాలోని 6 మున్సిపాలిటీలలో చేవెళ్ల, శంకర్‌పల్లి, షాద్‌నగర్‌లో కాంగ్రెస్ విజయఢంకా మోగించింది. ఇబ్రహీంపట్నం, ఆమనగల్ బీఆర్ఎస్ ఖాతాలో చేరాయి. మొయినాబాద్‌లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి.

ఇబ్రహీంపట్నంలో 24 స్థానాల్లో 13 బీఆర్ఎస్, 8 కాంగ్రెస్, 2 బీజేపీ, ఒకటి ఇతరులు గెలుచుకున్నారు. చేవెళ్లలో 18 స్థానాల్లో 11 కాంగ్రెస్ దక్కించుకోగా, 4 బీఆర్ఎస్, 3 బీజేపీ గెలిచాయి. శంకర్‌పల్లిలో 15 స్థానాల్లో 9 కాంగ్రెస్, 4 బీఆర్ఎస్, 2 ఇతరులు విజయం సాధించారు. షాద్‌నగర్‌లో 28 స్థానాల్లో 15 కాంగ్రెస్, 11 బీఆర్ఎస్ గెలుచుకోగా, ఒక బీజేపీ, ఒకటి ఇతరులు దక్కించుకున్నారు. ఆమనగల్‌లో 15 వార్డుల్లో 8 బీఆర్ఎస్, 6 బీజేపీ, ఒక కాంగ్రెస్ గెలిచింది.

**వికారాబాద్ జిల్లాలో మూడు కాంగ్రెస్ గెలుపు**

వికారాబాద్ జిల్లాలోని 4 మున్సిపాలిటీలలో కొడంగల్, వికారాబాద్, తాండూరులో కాంగ్రెస్ విజయం సాధించింది. పరిగిలో హంగ్ వచ్చింది.కొడంగల్‌లో 12 వార్డుల్లో 10 కాంగ్రెస్ గెలుచుకోగా, ఒకటి బీఆర్ఎస్, మరొకటి ఇతరులు దక్కించుకున్నారు. వికారాబాద్‌లో 34 వార్డుల్లో 16 కాంగ్రెస్, 11 బీఆర్ఎస్, 4 బీజేపీ, 3 ఇతరులు గెలిచారు. తాండూరులో 36 స్థానాల్లో 19 కాంగ్రెస్, 12 బీఆర్ఎస్, 3 బీజేపీ, ఇద్దరు స్వతంత్రులు విజయం సాధించారు. పరిగిలో 18 స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ చెరో 8 స్థానాలు గెలుచుకోగా, ఇద్దరు స్వతంత్రులు గెలవడంతో హంగ్ పరిస్థితి నెలకొంది.

## మేడ్చల్--మల్కాజిగిరిలో కారు జోరు

**బలగం టీవీ, హైదరాబాద్**
మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో రెండు చోట్ల బీఆర్ఎస్ విజయం సాధించగా, ఒక చోట హంగ్ వచ్చింది. మూడుచింతలపల్లిలో 24 స్థానాల్లో 14 బీఆర్ఎస్ గెలుచుకోగా, కాంగ్రెస్ 9 స్థానాలకు పరిమితమైంది. బీజేపీ ఒక చోట ఖాతా తెరిచింది. ఎల్లంపేట్‌లో 24 స్థానాల్లో 12 చోట్ల బీఆర్ఎస్ విజయం సాధించగా, కాంగ్రెస్ 8, బీజేపీ 4 స్థానాలు దక్కించుకున్నాయి. అలియాబాద్‌లో 20 స్థానాల్లో 8 కాంగ్రెస్, 7 బీఆర్ఎస్ గెలుచుకోగా, 3 బీజేపీ, 2 ఇతరులు గెలిచారు. ఎవరికీ పూర్తి ఆధిక్యం రాలేదు.



# జగిత్యాల మున్సిపాల్టీల్లో ఆసక్తికర ఫలితాలు

- **రెండు కాంగ్రెస్ ఖాతాలోకి**
- **రాయికల్, మెట్‌పల్లిలో తారుమారు పరిస్థితి**

**బలగం టీవీ, జగిత్యాల**
జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల ఎన్నికల ఫలితాలు రాజకీయంగా ఆసక్తికర చిత్రాన్ని ఆవిష్కరించాయి. ధర్మపురి, కోరుట్ల మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోగా, రాయికల్, మెట్‌పల్లిలో తారుమారు పరిస్థితి నెలకొంది. జగిత్యాలలో భిన్న రాజకీయ సమీకరణాలు కనిపిస్తున్నాయి.

**ధర్మపురిలో క్లీన్ స్వీప్**

ధర్మపురి మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులన్నింటినీ కాంగ్రెస్ గెలుచుకుని సంపూర్ణ ఆధిక్యం సాధించింది. కోరుట్లలో 33 వార్డుల్లో 18 స్థానాలు దక్కించుకుని అవసరమైన మెజారిటీని సాధించింది. దీంతో ఈ రెండు పట్టణ పాలక సంస్థలు కాంగ్రెస్ ఆధీనంలోకి వెళ్లాయి.

**రాయికల్‌లో హంగ్**

రాయికల్ మున్సిపాలిటీలో 12 వార్డుల్లో బీజేపీ 5, కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 3, ఒక స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. ఏ ఒక్క పార్టీకీ స్పష్టమైన మెజారిటీ రాలేదు.

**మెట్‌పల్లిలో స్వతంత్రుల కీలక పాత్ర**

మెట్‌పల్లిలో 26 వార్డుల్లో బీజేపీ 10, కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 6, స్వతంత్రులు 4 స్థానాలు గెలుచుకున్నారు. అవసరమైన 14 స్థానాలు దాటేందుకు బీజేపీ స్వతంత్రుల మద్దతు కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిసింది.

**జగిత్యాలలో భిన్న సమీకరణాలు**

జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డుల్లో కాంగ్రెస్ 23 స్థానాలు గెలుచుకుంది. మెజారిటీకి అవసరమైన 26 స్థానాలు రాకపోయినా, ఎంఐఎంకు చెందిన ఇద్దరు సభ్యులు, అలాగే ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అనుచరులుగా గెలిచిన నలుగురు స్వతంత్రులు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## మంచిర్యాల కార్పొరేషన్‌లో కాంగ్రెస్ ఘన విజయం

- **60 డివిజన్లలో 50 చోట్ల ఆధిక్యం**
- **ఖాతా కూడా తెరవని బీజేపీ**

**బలగం టీవీ, మంచిర్యాల**
మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ భారీ విజయం సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 60 డివిజన్లు ఉన్న ఈ కార్పొరేషన్‌లో ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ 50 డివిజన్లలో విజయం సాధించింది. మరో ఆరు డివిజన్లకు కౌంటింగ్ కొనసాగుతోంది. ఇక నాలుగు డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. మిగిలిన నాలుగు డివిజన్లలో మూడింటిలో కాంగ్రెస్ అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఈ ఎన్నికల్లో ప్రభావం చూపుతుందనుకున్న బీజేపీ మాత్రం కనీసం ఖాతా కూడా తెరవలేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మొత్తం మీద మంచిర్యాల కార్పొరేషన్‌లో కాంగ్రెస్ స్పష్టమైన మెజారిటీ సాధించి మేయర్ పదవిని సులభంగా దక్కించుకునే పరిస్థితి ఏర్పడింది.

## కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం

**మూడు మున్సిపాలిటీలను కైవసం చేసుకున్న హస్తం పార్టీ**

- **సీఎం సొంత నియోజకవర్గంలో కాంగ్రెస్ సంబరాలు**

**బలగం టీవీ, వికారాబాద్**
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, మద్దూర్, కోస్గి మున్సిపాలిటీలను కాంగ్రెస్ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మూడు పట్టణాల్లోనూ హస్తం పార్టీ ఆధిక్యం సాధించడం స్థానిక రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది.

**కొడంగల్ మున్సిపాలిటీ (వికారాబాద్ జిల్లా)**

మొత్తం 12 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ 10 వార్డులను గెలుచుకుంది. బీఆర్ఎస్ ఒక వార్డు, ఎంఐఎం ఒక వార్డు దక్కించుకున్నాయి.

**మద్దూర్ మున్సిపాలిటీ (నారాయణపేట జిల్లా)**

మొత్తం 16 వార్డుల్లో కాంగ్రెస్ 9 వార్డులు సాధించి మెజారిటీని పొందింది. బీఆర్ఎస్ 6 వార్డులు గెలుచుకోగా, ఒక స్థానాన్ని స్వతంత్ర అభ్యర్థి దక్కించుకున్నారు.

**కోస్గి మున్సిపాలిటీ**

మొత్తం 16 వార్డుల్లో కాంగ్రెస్ 8 వార్డులు గెలుచుకుంది. బీఆర్ఎస్, బీజేపీ ఒక్క వార్డూ గెలవలేకపోయాయి.

కొడంగల్ నియోజకవర్గంలో మూడు మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం పార్టీకి ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత ప్రాంతంలో సాధించిన ఈ విజయం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నింపుతోంది.

# సిరిసిల్ల మున్సిపాలిటీపై ఎగిరిన గులాబీ జెండా..




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగిరింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో 39 స్థానాలకు బీఆర్ఎస్ పార్టీ 27 మెజారిటీ స్థానాలు, కాంగ్రెస్ 6 స్థానాలు, బిజెపి ఐదు స్థానాలు, ఇండిపెండెంట్ ఒకటి స్థానాన్ని గెలుచుకున్నారు. అత్యధికంగా మెజార్టీ స్థానాలు సాధించిన బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోనున్నది.

సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించింది. పార్టీకి టికెట్ ఇచ్చిన అభ్యర్థులు 27 స్థానాలను గెలిచారు. ఈ విజయం పట్ల బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సంతృప్తి వ్యక్తం చేసినారు. సిరిసిల్ల మున్సిపల్‌ను బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోవడం ద్వారా కార్యకర్తల్లో కొత్త జోష్ నెలకొందని, గెలిచిన అభ్యర్థులకు శుభాకాంక్షలు, కార్యకర్తలకు మరియు ప్రజలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

**గెలిచిన అభ్యర్థులు వీరే**

1 వ వార్డ్ బూర బాలమల్లు (బిఆర్ఎస్), 2 వ వార్డ్ వేముల రాములు (బిఆర్ఎస్), 3 వ వార్డ్ జిందం కళా (బిఆర్ఎస్), 4 వ వార్డ్ లాయక్ సుల్తానా ( కాంగ్రెస్), 5 వ దార్నం అరుణ (బిఆర్ఎస్), 6 వ దూడం రజిని (బిఆర్ఎస్), 7 వ వార్డ్ ఎర్రం వెంకట్రాజం (బిజేపి), 8 వ వార్డ్ లింగంపెల్లి భాగ్యలక్ష్మి (బిఆర్ఎస్), 9 వ వార్డ్ దొంతరవేని కళ్యాణి (బిఆర్ఎస్), 10 వ వార్డ్ బొల్గం వైష్ణవి (ఇండిపెండెంట్), 11 వ వార్డ్ మామిడాల మహేష్ (బిజేపి), 12 వ వార్డ్ మొగిలి నాగరాజు (బిఆర్ఎస్), 13 వ వార్డ్ బుర్ర నారాయణ (బిఆర్ఎస్), 14 వ వార్డ్ వెంగళ లీల (కాంగ్రెస్), 15 వ వార్డ్ కూర భాగ్యలక్ష్మి (బిఆర్ఎస్), 16 వ వార్డ్ గుడ్ల శ్రీనివాస్ (బిఆర్ఎస్), 17 వ వార్డ్ గుండ్లపల్లి నీరజ (బిఆర్ఎస్), 18 వ వార్డ్ మేర్గు శ్రీనివాస్ (బిజేపి), 19 వ బొద్దుల శ్రీనివాస్ (కాంగ్రెస్), 20 వ వార్డ్ సాగాల హరిప్రసాద్ (బిఆర్ఎస్), 21 వ వార్డ్ ఎలుక వెంకటేశం (బిఆర్ఎస్), 22 వ వార్డ్ గంగరాజు (కాంగ్రెస్), 23 వ వార్డ్ ఆడెపు చంద్రకళ (కాంగ్రెస్), 24 వ వార్డ్ బుర్ర మల్లికార్జున్ (బిఆర్ఎస్), 25 వ వార్డ్ బింగి రాంబాబు (బిఆర్ఎస్), 26 వ వార్డ్ నెల్లుట్ల నరేశ్ (బిఆర్ఎస్), 27 వ వార్డ్ కాసర్ల పద్మ (బిఆర్ఎస్), 28 వ వార్డ్ అడిశర్ల రూప (బిఆర్ఎస్), 29 గెంట్యాల శ్యామల శ్రీనివాస్ (బిఆర్ఎస్), 30 వ వార్డ్ మంచె రేణుక శ్రీనివాస్( బిఆర్ఎస్), 31 వ వార్డ్ పాశికంటి రమ్య (బిఆర్ఎస్), 32 వ వార్డ్ కూరపాటి శ్రీశైలం (కాంగ్రెస్), 33 వ వార్డ్ కొండ వర్షిణి (బిజేపి), 34 వ వార్డ్ దార్ల సందీప్ (బీఆర్ఎస్), 35 వ వార్డ్ బత్తుల రమేశ్ (బిఆర్ఎస్), 36 కల్లూరి రేణుక (బిఆర్ఎస్), 37 వ వార్డ్ ఊరగొండ లక్ష్మి (బిజేపి), 38 వ వార్డ్ రిక్కుమల్లె రజిత సంపత్ (బిఆర్ఎస్), 39 వ ఆకుల స్వప్న కృష్ణ (బిఆర్ఎస్).









## కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో శుక్రవారం ఉదయం పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అయింది. సిరిసిల్ల సినారె కళామందిరంలో కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్.



## వెబ్ కాస్టింగ్ సెంటర్‌ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ సెంటర్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు.సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలోని సినారె కళామందిరాల్లో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా, వెబ్ కాస్టింగ్ సెంటర్ ద్వారా పరిశీలించారు. సెంటర్ లోని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ పరిశీలనలో కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, శ్రావణ్, ఈడీఎం శ్రీనివాస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## వేములవాడలో రోడ్డుపై బైఠాయించిన జర్నలిస్టులు..

**బలగం టీవీ, వేములవాడ:**
రాజన్న సిరిసిల్ల జిల్లా మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అధికారుల నిర్లక్ష్య వైఖరిపై జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేములవాడ మున్సిపల్ కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమై గంట గడిచినా, సంబంధిత ఫోటోలు, వీడియోలు అధికారిక డీపీఆర్ఓ గ్రూపులో అప్‌లోడ్ చేయకపోవడంతో స్థానిక మీడియా ప్రతినిధులు నిరసనకు దిగారు.

కౌంటింగ్ విజువల్స్ కోసం పలుమార్లు కోరినా, సిరిసిల్ల కౌంటింగ్ వీడియోలను వాడుకోవాలంటూ అధికారులు నిర్లక్ష్యంగా స్పందించినట్లు జర్నలిస్టులు ఆరోపించారు. సమాచారం సేకరించేందుకు గంటల తరబడి వేచి ఉన్నప్పటికీ, కనీస సహకారం అందించలేదని, ఫోన్ కాల్స్‌కు కూడా స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తూ కౌంటింగ్ కేంద్రం వెలుపల రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. వార్తల సేకరణలో అధికారుల నిర్లక్ష్యం తగదని, వెంటనే వేములవాడ కౌంటింగ్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలు మరియు అధికారిక అప్‌డేట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో కౌంటింగ్ కేంద్రం వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# మ్యాజిక్ ఫిగర్ దాటని వేములవాడ

- **కీలకం కానున్న ఇండిపెండెంట్ అభ్యర్థుల మద్దతు..**

**బలగం టీవీ, వేములవాడ**
వేములవాడ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఉత్కంఠభరితంగా ముగిశాయి. మొత్తం 28 వార్డులు ఉన్న మున్సిపాలిటీలో ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో హంగ్ పరిస్థితి నెలకొంది. వేములవాడ మున్సిపల్ లో మెజార్టీ సాధించడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 15 స్థానాలు కాగా, ప్రధాన పార్టీలు ఆ సంఖ్యను అందుకోలేకపోయాయి.కాంగ్రెస్ పార్టీ -- 13 స్థానాలు,బీజేపీ -- 8 స్థానాలు, బిఆర్ఎస్ -- 5 స్థానాలు,ఇండిపెండెంట్ అభ్యర్థులు -- 2 స్థానాలు గెలుచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, మ్యాజిక్ ఫిగర్‌కు రెండు స్థానాలు తక్కువగా నిలిచింది. దీంతో మున్సిపల్ చైర్మన్ పదవి కోసం రాజకీయ చర్చలు, పొత్తుల రాజకీయాలు ఊపందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఇండిపెండెంట్ కౌన్సిలర్ల పాత్ర కీలకంగా మారనుంది. వారి మద్దతు ఎటు వైపు దక్కుతుందో, మున్సిపాలిటీ పగ్గాలు ఎవరి చేతుల్లోకి వెళ్తాయో నిర్ణయించనుంది.మొత్తంగా వేములవాడ మున్సిపల్ ఫలితాలు జిల్లాలో రాజకీయ ఉత్కంఠను మరింత పెంచాయి.

**గెలిచిన అభ్యర్థులు వీరే..**

### హంగ్ దిశగా ఫలితాలు..

1వ వార్డు సంఘ హన్మవ్వ (కాంగ్రెస్), 2వ వార్డుఏనుగు జ్యోతి రెడ్డి (బిఆర్ఎస్), 3వ వార్డు గుడిసె సంతోష(కాంగ్రెస్), 4వ వార్డు తోట రాజు (కాంగ్రెస్), 5వ వార్డు వాసాల లావణ్య (బిఆర్ఎస్), 6వ వార్డు కాస శ్రీనివాస్(కాంగ్రెస్), 7వ వార్డు టైలర్ శ్రీనివాస్(ఇండిపెండెంట్), 8వ వార్డు మైలారాం శ్రీనివాస్(బి జె పి), 9వ వార్డు రామతీర్థపు మాధవి(బిఆర్ఎస్), 10వ వార్డు సిరిగిరి సంగీత(కాంగ్రెస్), 11వ వార్డు వెంగల అనిత(బిఆర్ఎస్), 12వ వార్డు రామతీర్థపు కృష్ణవేణి (కాంగ్రెస్), 13 వ వార్డు మూడపల్లి నీలమ్మ(కాంగ్రెస్), 14వ వార్డు తుమ్ మధు(కాంగ్రెస్), 15వ వార్డు పుల్కం రాజు(కాంగ్రెస్ ), 16వ వార్డు వంగల శ్రీనివాస్(బిజెపి), 17వ వార్డు కొండ్లపూ చిన్న ముత్యం(బీజేపీ), 18వ వార్డుకొండా రాజశేఖర్(కాంగ్రెస్ ), 19వ వార్డు కుమ్మరి శిరీష శ్రీనివాస్( ఇండిపెండెంట్), 20వ వార్డు కుమ్మరి శంకర్(బీజేపీ), 21 వ వార్డు నరాల శేఖర్(బీఆర్ ఎస్), 22వ వార్డు ఇప్పపూల మమత(కాంగ్రెస్), 23వ వార్డుబోనాల సాగరిక(బీజేపీ ), 24వ వార్డు అన్నారం శ్రీనివాస్(కాంగ్రెస్), 25వ వార్డు కొక్కుల బాలకృష్ణ (కాంగ్రెస్ ), 26వ వార్డు మామిండ్ల అమర్య(బీజేపీ ), 27వ వార్డు రేగుల రేణుక(బీజేపీ), 28వ వార్డు ప్రతాప హిమబిందు(బీజేపీ)

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్, ఇండిపెండెంట్ అభ్యర్థులు..

**బలగం టీవీ, వేములవాడ:**



మున్సిపల్ ఎన్నికల్లో విజయడంకా మోగించిన కాంగ్రెస్ పార్టీ లో చేరికల పర్వం కొనసాగుతుంది.. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో గెలుపొందిన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ నరాల శేఖర్,ఇండిపెండెంట్ అభ్యర్థులు కుమ్మరి శిరీష శ్రీనివాస్, ఆలే (టైలర్) శ్రీనివాస్ లు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి ప్రభుత్వ విప్ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసం రోజు రోజుకు పెరుగుతోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు ప్రజల మార్పు ఆకాంక్షకు నిదర్శనమని అన్నారు . అభివృద్ధి, పారదర్శక పాలన, సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

## సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం...

- **సుల్తానాబాద్ మున్సిపాలిటీ కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ**

**బలగం టీవీ, పెద్దపల్లి:**

01) ఈర్ల స్వరూప (కాంగ్రెస్)
02) గాజుల రాజమల్లు ( కాంగ్రెస్)
03) కందునూరి సమత (బీజేపీ)
04) బిరుదు కృష్ణ (కాంగ్రెస్)
05) గరిగే శోభారాణి (కాంగ్రెస్)
06) బాకం సాయి కిరణ్ (కాంగ్రెస్)
07) వర ప్రదీప్ (కాంగ్రెస్)
08) చింతల రాజు (కాంగ్రెస్)
09) టికే ప్రభాకర్. (కాంగ్రెస్)
10) అంతటి పుష్పలత(కాంగ్రెస్) .
11) కల్వల శంకరమ్మ (దీక్ష్మూ)
12) అమీరిశెట్టి శ్రావణి (ఘక్ష్మీఖీధూ)
13) సిద్ధ తిరుపతి ( కాంగ్రెస్)
14) వేగోళం పద్మ (కాంగ్రెస్)
15) గాదాసు మంజుల (కాంగ్రెస్)

కాంగ్రెస్ : 12
బీజేపీ : 1
బిఆర్ఎస్: 1
సింహం: 1

మొత్తం : 15

## మోడల్ స్కూల్స్ దరఖాస్తులకు
# ఫిబ్రవరి 28 వరకు గడువు

(మొదటి పేజీ తరువాయి)

7వ తరగతి కోసం 1,604 మంది, 8వ తరగతి కోసం 1,370 మంది, 9వ తరగతి కోసం 790 మంది, 10వ తరగతి కోసం 181 మంది ఉన్నారు. మరో 598 మంది దరఖాస్తు రుసుం చెల్లించారు. కానీ దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 194 మోడల్ స్కూల్స్ ఇంగ్లీష్ మీడియంలో ఉచిత విద్యను అందిస్తున్నాయి. వంద మంది బాలికల వరకు హాస్టల్ వసతిని అందిస్తున్నారు. ప్రతి తరగతిలో రెండు సెక్షన్లుగా 50 మంది విద్యార్థుల చొప్పున ఉంటారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా

(మొదటి పేజీ తరువాయి)

డివిజన్లలో 46, నల్లగొండలో 48 వార్డుల్లో 27 స్థానాల్ని కాంగ్రెస్‌పార్టీ కైవసం చేసుకుంది. మహబూబ్ నగర్‌లో మొత్తం 60 స్థానాల్లో కడపటి వార్తలందే సరికి 43 స్థానాలకు ఫలితాలు వెల్లడయ్యాయి. అందులో కాంగ్రెస్‌కు 24స్థానాలు దక్కాయి. నిజామాబాద్, కరీం నగర్‌లలో బీజేపీ మెజార్టీ స్థానాలను దక్కించుకున్నా మేజిక్ ఫిగర్‌ను అందుకోలేకపోవడం తో ఇక్కడ మేయర్ ఎన్నిక రసవత్తరంగా మారనుంది. ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల అభ్యర్థుల మద్దతు కోసం ఆ పార్టీ పావులు కదుపుతోంది. కొత్తగూడెంలో ఒంటరిగా పోటీ చేసిన సీపీఐ మెజార్టీ స్థానాలను దక్కించుకుంది. మొత్తం 60 స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐ చెరో 22 డివిజన్లలో విజయం సాధించారు. ఇక్కడ బీఆర్ఎస్ 8 స్థానాలను గెలిచి, సీపీఐకి మద్దతు ఇస్తున్నట్లు

ప్రకటించింది. దీనితో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ సీపీఐ వశం అయ్యింది. కాంగ్రెస్‌పార్టీ నేరేడుచర్ల, హుజూర్‌నగర్, హాలియా, కోదాడ, నందికొండ, చండూరు, చిట్యాల, భూత్పూర్, ధర్మపురి, భీంగల్, బిచ్కుంద, బాన్సువాడ, ఎల్లారెడ్డి, చొప్పదండి, సుల్తానాబాద్, చెన్నూరు, మంథని, హుస్నాబాద్, మరిపెడ, డోర్నకల్, నారాయణఖేడ్, సంగారెడ్డి, ఆందోలు-జోగిపేట, సదాశివపేట, రామాయంపేట, హుజూరాబాద్, కొల్లాపూర్, కల్వకుర్తి, మద్దూరు, పెబ్బేరు, స్టేషన్‌ఘన్‌పూర్, మధిర, అశ్వారావుపేట, ఇల్లెందు, ములుగు, యాదిగిరిగుట్ట, ఆలేరు మున్సిపాల్టీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించింది. గడ్డపోతారం, ఇంద్రేశం, అయిజ, తొర్రూర్, ఇబ్రహీంపట్నం, తిరుమలగిరి, ఆమన్‌గల్, సిరిసిల్ల సహా మొత్తం 14 మున్సిపాల్టీలను బీఆర్ఎస్ వశం చేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాల్టీలో ఫార్వర్డ్ బ్లాక్ మెజార్టీ స్థానాలను దక్కించుకుంది. దేవరకద్ర, అలంపూర్, దేవరకొండ, ఆలియాబాద్, కోహీర్, కేసముద్రం, ఆసిఫాబాద్, అమరచింత, గద్వాల, క్యాతనపల్లి, జనగామ, జిన్నారం, నర్సాపూర్, జమ్మికుంట, వేములవాడ, రాయికల్, జహీరాబాద్, బెల్లంపల్లిల్లో ఏపార్టీకి స్పష్టమై మెజార్టీ రాలేదు. ఇండిపెండెంట్లు ఇతర పార్టీల అభ్యర్థుల మద్దతుపై ఇక్కడ ఎవరికి అధికారం దక్కనుందో ఈ నెల 16న తేలనుంది.

# బంగ్లాదేశ్ ఎన్నికల్లో బీఎన్‌పీ కూటమి విజయం

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 299 పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో మిత్రపక్షాలతో కలిపి 211 స్థానాలు గెలుచుకున్నట్లు బీఎన్‌పీ వెల్లడించింది. బీఎన్‌పీ ఛైర్‌పర్సన్ ఖాలిదా జియా కుమారుడు తారిఖ్ రహ్మాన్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు దిశగా పార్టీ అడుగులు వేస్తోంది. ఇక జీుఝుఖ్-వ-క్ష్మీంశ్రీుఎఅ 70 స్థానాల్లో విజయం సాధించినట్లు సమాచారం. బోగురా-6 (సదర్) నియోజకవర్గంలో తారిఖ్ రహ్మాన్ సమీప ప్రత్యర్థిపై భారీ మెజారిటీతో గెలుపొందినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. మొత్తం 151 పోలింగ్ కేంద్రాల్లో 150 కేంద్రాల లెక్కింపు పూర్తయ్యాకే విజయం ఖాయమైంది.

ఎన్నికల ఫలితాల మధ్య బీఎన్‌పీ శ్రేణుల్లో సంతాప వాతావరణం నెలకొంది. ఎన్నికలకు ముందు ఖాలిదా జియా మరణించడంతో తారిఖ్ రహ్మాన్ పార్టీ కార్యకర్తలకు సంబరాలు నిర్వహించవద్దని సూచించారు. జుమ్మా నమాజ్ అనంతరం ఖాలిదా జియా ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలను వాయిదా వేశారు.

దేశవ్యాప్తంగా 13వ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4.30 వరకు కొనసాగింది. దాదాపు 12.7 కోట్ల మంది ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకోగా, 50 శాతానికి పైగా పోలింగ్ నమోదైనట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడించాయి. కొన్నిచోట్ల స్వల్ప హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, మొత్తం మీద ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.

# ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడిన హైడ్రా

(మొదటి పేజీ తరువాయి)

అందిన వెంటనే రంగంలోకి దిగి వాటిని రక్షిస్తోంది. ఇలా శుక్రవారం ఒకే రోజు.. ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడి 2260 గజాల స్థలానికి హైడ్రా ఫెన్సింగ్ వేసింది. మరో చోట 1452ల గజాలకు పైగా ఉన్న పార్కు స్థలాన్ని కబ్జాల నుంచి విడిపించింది. మొత్తమ్మీద 3712 గజాల విస్తీర్ణంలో పార్కులు అందుబాటులోకి రావడంతో ఆయా ప్రాంతాల్లో పండగ వాతావరణం నెలకొంది. స్థానికులు పెద్దయెత్తున బయటకు వచ్చి పార్కుల కబ్జాలను తొలగించిన హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు. హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డుల ముందు ఫొటోలు దిగారు. భారీ ర్యాలీలు తీసి సంబరాలు చేసుకున్నారు. ఈ పార్కుల విముక్తికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కుతుల్లాపూర్ మండలం, జీడిమెట్ల విలేజ్, సుభాష్ నగర్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీ లే ఔట్‌ను 1968లో వేశారు. 80 ఎకరాలలో 810 ప్లాట్లతో ఈ లే ఔట్ వేసి.. ఇందులో 10 పార్కులను కేటాయించారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడకు విద్యుత్‌ను అందించేందుకు వేసిన హైటెన్షన్ కరెంటు లైను ఈ లే ఔట్ మీదుగా వెళ్లింది. దీంతో హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద పలు పార్కులను అప్పటి లే ఔట్ వేసిన వారు కేటాయించారు. వేరే లైను ద్వారా పారిశ్రామిక వాడకు విద్యుత్‌ను అందించడంతో భాగ్యలక్ష్మి కాలనీ మీదుగా వెళ్లే హైటెన్షన్ వైర్లను 20 సంవత్సరాల క్రితం తొలగించారు. ఇక అక్కడి నుంచి ఆక్రమణలు జరుగుతున్నాయి. స్థానిక అధికారులకు చెప్పినా ప్రయోజనం లేకపోయిందని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు సంబంధిత శాఖలకు చెందిన వారితో హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో విచారించారు. పార్కు స్థలాలుగా నిర్ధారించుకున్నారు. శుక్రవారం వరుసగా ఉన్న 6 పార్కుల ఆక్రమణలను తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేశారు. పార్కు స్థలాలుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో అక్కడి కాలనీవాసులు సంబరాలు చేసుకున్నారు. బోర్డుల ముందు నిలబడి ఫొటోలు దిగారు. హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు. ర్యాలీలు తీసి సంబరాలు చేసుకున్నారు.

# కీసరగుట్టలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**

కీసరగుట్టలో శ్రీ భవాని శివ దుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విగ్నేశ్వర పూజతో శుక్రవారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. ప్రారంభోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించగా, జాతర క్రీడోత్సవాలకు కూడా శ్రీకారం చుట్టారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆరు రోజుల ట్రాఫిక్ ఆంక్షలు, 330 ప్రత్యేక బస్సుల ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. కీసరగుట్ట దేవస్థానంలో గణపతి పూజను ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ నిర్వహించగా, అనంతరం ప్రత్యేక పూజలు, మహామంగళహారతులతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మెన్ తటాకం వెంకటేష్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.



బ్రహ్మోత్సవాల సందర్భంగా మహాశివరాత్రి జాతర క్రీడోత్సవాలను చైర్మెన్ తటాకం వెంకటేశ్ శర్మ ప్రారంభించారు. ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ వర్గాలు తెలిపారు. వివిధ ధార్మిక కార్యక్రమాలు, వాహన సేవలు నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఈవో సుధాకర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు, జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి, కీసర సీఐ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 13 నుంచి 18 వరకు జవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ పరిధిలో భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నట్లు ట్రాఫిక్-క్ష్మీ డీసీపీ తెలిపారు.

**330 ప్రత్యేక బస్సులు..**

భక్తుల సౌకర్యార్థం కుషాయిగూడ డిపో ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 330 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. ఈసీఐఎల్ బస్టాండ్ నుంచి ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉండగా, సికింద్రాబాద్, ఉప్పల్, అఫ్జల్‌గంజ్ తదితర ప్రాంతాల నుంచి నేరుగా కీసరగుట్టకు సర్వీసులు ఏర్పాటు చేశారు. భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

# ప్రజల విశ్వాసానికి ఇది నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ నేతలు గాలి కబుర్లు చెబుతూ కట్టు కథలు వినిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై, కాంగ్రెస్‌పై చేసిన విమర్శలను గమనించి రాష్ట్ర ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన తీర్పునిచ్చారని చెప్పారు. పట్టణ ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వంపై మరింత బాధ్యత పెరిగిందనీ, అత్యున్నత ప్రమాణా లతో పాలన అందిస్తామని స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో, ఆ తర్వాత కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆ తరువాత పంచాయతీ ఎన్నికల్లో వరుసగా ప్రజా ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారని, ప్రతిపక్షాలు ఈ విషయాన్ని గమనంలో పెట్టుకోవాలని సూచించా రు. ప్రజలకు జవాబుదారీ గా ప్రతిపక్షాలుండాలని సూచించారు. సంపూర్ణ విజయం కోసం శ్రమించిన పార్టీ నేతలు, కార్యకర్తల కు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్ వైఫల్యానికి, బీఆర్ఎస్ పోరాటానికి నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

సెక్రెటరీ సాంబశివరావు తో కూడా నేను మాట్లాడాను అని అన్నారు. కొత్తగూడెంలో కూడా ఇది హంగ్ వచ్చింది. నేను వారికి అయితే ఓపెన్ ఆఫర్ ఇచ్చినాను. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలు, సింగరేణిలో జరుగుతున్న దుర్మార్గాలు, అరాచకాలకు అడ్డుకట్ట వేయాలి అంటే డెఫినెట్ గా మేము మీతో కలిసి వస్తాము, కాంగ్రెస్ బిజెపిని అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రెండు చోట్ల కూడా అక్కడ 51 శాతం వాటా సింగరేణిలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అక్కడ ఉంది. 49 శాతం వాటా కేంద్ర ప్రభుత్వానికి ఉంది, బిజెపి కి అందులో భాగస్వామ్యం ఉందని తెలిపారు.

సీపీఐ గనుక తీసుకోవాలనుకుంటే కొత్తగూడెం కార్పొరేషన్ మీరు తీసుకోండి, మేము మద్దతు ఇస్తాము ఓపెన్ గా అని చెప్పడం జరిగింది. సింగరేణిలో జరుగుతున్న దోపిడీని, సింగరేణి కేంద్రంగా ఉన్న కొత్తగూడెంలో తప్పకుండా అక్కడ మరి కాంగ్రెస్ బిజెపిని ఎండగట్టాలనే ఉద్దేశంతోనే ఈ ఆఫర్ కూడా మేము ఇచ్చాం. అట్లా కలిసి వచ్చే లౌకిక పార్టీలు ఉంటాయి చాలా రకరకాల కాంబినేషన్స్ ఉంటాయి. గట్టిగా క్షేత్ర స్థాయిలో మా నాయకులు, మా కార్యకర్తలు కూడా బలంగా కొట్లాడారు. మంచి భవిష్యత్తు ఉంది అనడానికి, అట్లగే ఈ రోజు ప్రధాన ప్రత్యమ్నాయం, ప్రధాన ప్రతిపక్షమే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ తో పోరాడగలిగిన శక్తి, కాంగ్రెస్ ను గద్దె దించే శక్తి, బిజెపిని నిరోధించే శక్తి ఖచ్చితంగా బిఆర్ఎస్ కు మాత్రమే ఉంది అని మొన్న పల్లెల్లో జరిగిన ఎన్నికలు, ఇవాళ పట్టణంలో జరిగిన ఎన్నికలు తేల్చి చెప్పాయని అన్నారు.

పల్లెల్లో 4000 పైచిలుకు సర్పంచ్‌లను గెలిపించారు ప్రజలు. అట్లగే పట్టణంలో కూడా ప్రధాన ప్రతిపక్షం కేవలం బిఆర్ఎస్ మాత్రమే, పోరాడే సత్తా ఉన్న పార్టీ బిఆర్ఎస్ మాత్రమే. రెండు పార్టీలు ఒకటి ఢిల్లీలో అధికారంలో ఉంది, ఇంకోటి రెండోది రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఈ రెండు పార్టీలు ఉన్నప్పటికీ ఎన్ని రకాల కుయుక్తులు పన్నినప్పటికీ బిఆర్ఎస్ , కెసిఆర్ గారి నాయకత్వమే ఈ రాష్ట్రానికి శ్రీరామరక్ష అని చెప్పి మళ్ళీ ఒకసారి ఇటు పల్లెల్లో ఇటు పట్టణాల్లో ప్రజలు తేల్చినట్టు అయిందని, ఇదే ఉత్సాహంతో రేపు హైదరాబాద్ కార్పొరేషన్ గానీ, మిగతా కార్పొరేషన్ వరంగల్, ఖమ్మం గానీ, అట్లగే జిల్లా పరిషత్ ఎన్నికలు పెడితే వాటిలో గానీ ఇదే ఉత్సాహంతో ముందుకు పోతామని, కాంగ్రెస్ దుర్మార్గాలు, అరాచకాలను వదిలిపెట్టమని హెచ్చారించారు.

మా కార్యకర్తలకి, నాయకులకి మాకు సపోర్ట్ చేసిన ప్రజలకి, మాకు ఓటు వేసిన ప్రజలకి చాలా స్వల్పమైన తేడాతో ఓడిపోయిన మా లీడర్స్ కు ధన్యవాదాలు అని తెలియజేశారు. ఓడిపోయిన వారు కూడా ఎవరూ నిరాశ పడవద్దని, బేజారు కావద్దని చెప్పి కూడా వారికి కూడా విజ్ఞప్తి చేస్తూ మీకు కూడా మరోసారి ధన్యవాదాలు. రాష్ట్రంలో 124 చోట్ల ఎన్నికలు జరిగితే, 30 హంగ్ ఉన్నాయి, 15 మేము గెలిచినాం. అంటే 46 పోతే మిగతావి వాళ్ళు గెలిచారు. హంగ్ వచ్చిన చోట ఏ వైఖరి అవలంబించాలి అనేది మా పెద్దలు, మా పార్టీ అధ్యక్షులు కేసీఆర్ గారితో కూడా మాట్లాడతాం. అట్లాగే స్థానిక నాయకత్వం మనోభావాలు కూడా మేము పరిగణలోకి తీసుకుంటామని, స్థానిక నాయకుల మనోభావాలు, స్థానికంగా ఏ పరిస్థితులు ఉన్నాయి అవి కూడా బేరీజు వేసుకున్నాక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇంకా రెండు రోజుల టైం ఉంది. కాబట్టి ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

నేను రాజు నేను మంత్రి అనుకున్న వాళ్ళని ఎంతో మందిని చూసినమని, పిచ్చి తుగ్లక్ లు చాలామంది ఉంటారని, అట్లాంటి వాళ్ళు వస్తారు, పోతారు. ఎవరూ పర్మనెంట్ కాదని అన్నారు. నేనే రాజు, నేనే మంత్రి అనుకున్న వాళ్ళు చాలామంది అట్లాగే గాలికి కొట్టుకుపోయారు. ఈ దేశం చాలా గొప్ప దేశం, ప్రజల చైతన్యాన్ని ఎవరైనా తక్కువ అంచనా వేస్తే వారు చాలా తెలివితక్కువ వాళ్ళు. ఈ దేశంలో ఇందిరా గాంధీ గారు ఓడిపోయారు, ఎన్టీ రామారావు గారు ఓడిపోయారు. కేసీఆర్ లాంటి తెలంగాణ తెచ్చిన నాయకుడు కూడా మన కామారెడ్డిలో దురదృష్టవశాత్తూ ఓటమి పాలయ్యారు. అట్లా రేవంత్ రెడ్డి లాగా విర్రవీగిన వాళ్ళు, నేనే రాజు, నేనే మంత్రి అన్న వాళ్ళు చాలామంది వచ్చారు, చాలామంది పోయారు. కానీ దేశం అట్లే ఉంది, ప్రజల చైతన్యం అట్లే ఉంది. చైతన్యాన్ని తక్కువ అంచనా వేసిన వాళ్ళు ఎవరైనా కూడా గాలికి పోతారని, పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో మేము మొదటి నుంచి ఒకటే చెప్తున్నామని, రేవంత్ రెడ్డి మళ్ళీ నాకు తెలిసి ఇవాళ వచ్చి మేము గెలిచినాం, మాకు తిరుగు లేదు, పొరుగు లేదు, నేనే రాజు, నేనే మంత్రి అని మళ్ళీ ఫోజులు కొడతారని అన్నారు. కానీ రేవంత్ రెడ్డిని ఒకటే అడుగుతున్నా, నిజంగా నీ గవర్నమెంట్ మీద నీకు అంత నమ్మకం ఉంటే, ఆ పది మందితో రాజీనామా చేయించి ఎలక్షన్స్ కి పోదామని అన్నారు. ఎందుకంటే ఇవి స్థానిక ఎన్నికలు. అక్కడ మురుగు నీరు బాగుందా, అక్కడ నీళ్ళు వస్తున్నాయా లేదా, అక్కడ అభ్యర్థి ఓడిపోయాడా గెలిచాడా వీటన్నిటి మీద నడుస్తుందని రాజీనామా చేయండి, ఎన్నికలకు రండి. ప్రజలు చెప్తారు, 10 చోట్ల ఉప ఎన్నికలు వస్తే డెఫినెట్ గా అది ఒక ఇండికేటర్ అని, ప్రధాన ప్రతిపక్షంగా మేము సఫలమయ్యామని భావిస్తా ఉన్నామని తెలిపారు.ప్రజల ఇషఫ్యుస్ ని ఎత్తుకోవడం, ఆరు గ్యారెంటీల అమలు వైఫల్యం, 420 హామీల అమలు వైఫల్యం, బలహీన వర్గాలకు ఈ ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగట్టడంలో, మైనారిటీలకు ఈ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఎండగట్టడంలో, దళిత గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎగ్గొట్టిన విషయంలో గానీ, మహిళల విషయంలో గానీ, యువకుల విషయంలో గానీ ప్రతి విషయంలో అందరికంటే అగ్రెసివ్ గా ముందున్నది బిఆర్ఎస్ పార్టీ నని అన్నారు. కాబట్టి సహజంగానే మా కోసం కొట్లాడుతున్న వాళ్ళు అనే భావన ఉన్నప్పుడు ప్రజలు కూడా మాకే మద్దతు ఇస్తున్నారు. ఈ రోజు ప్రజల్లో మార్పు, ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉంది ఈ ప్రభుత్వం మీద అనేది ఆల్రెడీ బయట పడుతోంది. అధికార పార్టీ 80-90 శాతం గెలిస్తేనే గెలిచినట్టు లేకపోతే అది ఏం గెలుపు అని, స్థానిక ఎన్నికలు స్థానికంగానే కొట్లాడతాం అని చెప్పాము, రాజకీయాల్లో ఎప్పుడూ లోకల్ బాడీస్ అనేది ప్రభుత్వానికి వన్ సైడ్ గా అంటే అద్భుతమైనటువంటి పరిపాలన ఉన్నప్పుడు వన్ సైడ్ ఎలక్షన్స్ జరుగుతాయని తెలిపారు.